శత్రువులు ముగ్గురు?

సుజనశ్రీ

"ఒకేయ్ అన్నాయ్! ఎలక్ట్రిక్ స్థంభానికి ఆనుకున్న వ్యక్తిని చూడు! ఇందాకట్నుంచి అక్కడే నిలబడి వున్నాడు. మన షాపువంకే చూస్తున్నాడు" అంది సునీత రోడ్డుమీదికి చూస్తూ.

"రోడ్డుమీద అనేకమంది తిరుగుతుంటారు అనేక పనుల మీద!" సమాధానం చెప్పాడు సునీత అన్న సుధీర్.

"అది కాదురా! అతడి చూపులు మామూలుగా లేవు. ఏ పులో మరో క్రూరమృగమో చూసినట్టుగా వున్నాయ్. ఎందుకో వాడి చూపులు నన్ను భయపెడుతున్నయ్."

"నువ్వు ఒట్టి పిరికిదానివి! అంతే! వాడు ఎవరికోసమన్నా ఎదురుచూస్తున్నాడేమో! పదినిమిషాలపాటు వాడివైపు చూడకు. ఆ తర్వాత వాడి మానాన వాడే పోతాడు. నీ భయమూ తీరిపోతుంది" సుధీర్ చెల్లెల్ని ఓదార్చాడు.

ఆ అన్నా చెల్లెలు కూర్చున్న షాపు పేరు "అపురూప స్టోర్స్". అందులో దైనందినానికి పనికివచ్చే సరుకులేవీ వుండవు. పేరుకు తగ్గట్టుగా అపురూపమైన వస్తువులే వుంటయ్.

చైనాలో తయారయిన పింగాణీ, జపాన్ తయారీ వాజ్ లూ, ఆఫ్రికానుంచి వచ్చిన ఏనుగుదంతాలూ, పులి చర్మాలూ, పన్నా (మధ్యప్రదేశ్) నుంచి నగిషీ పెట్టిన వజ్రాలు, గంగానదిలోని మొసళ్ళ చర్మాలూ, తాబేటి చిప్పలూ, పాము చర్మాలూ యిలాంటివే వుంటయ్.

సుధీర్ తండ్రి సుకుమార్ జియాలజీలో ప్రొఫెసర్ గా పనిచేసి రిటైర్ అయాడు. అతడు అగ్నిపర్వతాల గురించి భూమిపై రాలిన ఉల్కా శిధిలాల గురించి చాలా రీసెర్చి చేసివున్నాడు. యునైటెడ్ నేషన్స్ సైంటిఫిక్ ఆర్గనై జేషన్ సుకుమార్ ని ఆనరరీ డైరక్టర్ గా నియమించింది ఆయన రిటైరైనాక కూడా!

ప్రపంచంలో ఎక్కడ అగ్నిపర్వతం బద్దలైనా, ఎక్కడ ఉల్క రాలినా, ఆ ప్రదేశానికి సుకుమార్ పంపబడేవాడు, సైంటిఫిక్ ఆర్గనైజేషన్ తరఫున. ఆ రకంగా సుకుమార్ ప్రపంచంలో అన్ని దేశాలూ తిరిగాడు. తాను వెళ్ళిన ప్రతిదేశాన్నుంచీ ఏదో ఒక అపురూపమైన వస్తువును తెచ్చి స్టోర్ లో చేర్చేవాడు సుకుమార్.

గ్రీస్ దేశం నుంచి మూడువందల సంవత్సరాల క్రితం తయారుచేయబడిన పింగాణీ జాడీనికూడ తెచ్చాడు. దాని ఎత్తు ఆరడుగులు, వ్యాసం మూడడుగులు ఉంటుంది. కుమారైన మనిషి దాన్లో నిల్చుని దాక్కోవచ్చు.

అపురూపా స్టోర్స్‌లో వున్నవన్నీ అపురూపమైనవీ, అధిక వెల గలవీ అవటంవలన అక్కడ ప్రతిరోజూ అమ్మకం వుండదు. ఎప్పుడో ఏ లక్షాధికారో, లేక ఓడ దిగిన అమెరికన్ ధనికుడో ఆ స్టోర్సుకు వచ్చి, వెయ్యి నుంచి అయిదువేల వరకూ ధరపలికే ఏదో ఒక అపురూపమైన వస్తువుని కొనుక్కుని వెళ్ళేవాడు.

అలాగే అప్పుడప్పుడు ఓడ కళాసీలు, సరంగులూ వచ్చి తమవద్దవున్న విలువైన వస్తువుల్ని అపురూపా స్టోర్స్‌లో అమ్మి, డబ్బు తీసుకుపోతుండేవారు.

సుకుమార్‌కి ఇద్దరే సంతానం. సుధీర్, సునీత. సుధీర్ యం. యస్.సి చదువుతున్నాడు, కెమిస్ట్రీ సబ్జక్టుతో. తీరిక వేళల్లో స్టోర్స్‌లో కూర్చుంటాడు. అతడికి సహపాఠి, దూరపు బంధువూ అయిన రాజా కూడా వారింట్లోనే వుంటున్నాడు.

అపురూపాస్టోర్స్ పైభాగంలోనే వారి నివాసం. పైఅంతస్తులో ముందుగదిని ఆఫీసుగా చేసుకుని సుధీర్, రాజులు డిటెక్టివ్ ఏజన్సీని నెలకొల్పారు.

ఇద్దరూ కెమిస్ట్రీలో వుద్దండులు గనుక పోలీసు డిపార్టుమెంటుకు తరచూ సాయపడుతుండేవారు. నేర పరిశోధనలో కెమికల్ ఎనాలిసిస్ చేయడంలోనూ, కార్బన్ టెస్ట్, ఫోరెన్సిక్ పరీక్షలు జరపటంలో పోలీసు డిపార్టుమెంటుకు నేరస్థుల్ని ఆచూకీ తీయటంలో ఉపయోగపడేవారు. తద్వారా ప్రభుత్వం నుంచి బహుమతులు ముట్టేవి.

సునీత కాన్వెంట్‌లో కేంబ్రిడ్జి సర్టిఫికేట్ కోర్సుకు చదువుతోంది. అందమయినదీ చలాకీగల యువతి.

పదినిముషాలు గడిచాయి. రోడ్డుకవతలి మనిషి ఎలక్ట్రిక్ స్థంభం దగ్గరనుంచి కదలలేదు. సిగరెట్ మీద సిగరెట్ కాల్చేస్తున్నాడు.

అతడు ఆరడుగుల పొడవున్నాడు. అందుకు తగ్గ లావు, కోలముఖం, గ్రద్దముక్కు, చూపులతోనే పొడిచేస్తున్నంత వాడిచూపులూ, మనిషి చూసేందుకు కొంచెం భయంకరంగానే వున్నాడు.

కానీ అతడి డ్రెస్ గురించి, అతడ్ని దుర్మార్గుడిగా లెక్కించనక్కర్లేదు. నీలంరంగు, ప్యాంటు, ఎర్రని టై, చాక్‌లెట్ కలర్ కోటూ, నల్లగా నిగనిగలాడే బూట్లూ చేతికి ఎలక్ట్రానిక్ వాచ్, నెత్తిన ఈవెనింగ్ హ్యాట్ ధరించి వున్నాడు.

అతడు ఏదో లావాటి ప్యాకెట్‌ని, రెండుచేతుల్లో పట్టుకుని గుండెల కదుముకుని వున్నాడు. ఎవరో దాన్ని లాక్కుపోతారేమో అన్నంత గట్టిగా పట్టుకున్నాడు ఆ ప్యాకెట్‌ని.

"ఒరే అన్నాయ్! ఆ మనిషి పదినిమిషాల్లో వెళ్ళిపోతాడన్నావే! అతడు ఇంకా కదల్లేదు చూడరా! అతడ్ని చూస్తోంటే నాకేదో అనుమానంగా ఉంది!" సునీత మళ్ళీ అంది బెరుగ్గా చూస్తూ.

"వాడి తిప్పలేవో వాడు పడతాళ్ళే!"

"నీవెన్నన్నా చెప్పరా! వాడు ఏదో కానిపనికే నిలబడి వున్నాడని నా అనుమానం. మనదుకాణంలోంచి ఏదన్నా దొంగిలించుకుపోవటానికి అతడు పన్నాగం వేయటంలేదు గదా!"

"నీతో వాదించేందుకు నాకు టయిమ్‌లేదు. నేను లేబరటరీకి వెళ్ళిరావాలి. ఎవరన్నా కస్టమర్స్ వస్తే, మేడ

మీద నాన్నగారున్నారు. వారిని పిలు!'' అంటూ సుధీర్ అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయాడు. వాకిట్లో స్కూటర్ని స్టార్ట్ చేసి రోడ్డుమీదికెళ్ళాడు.

సుధీర్ వెళ్ళిపోవటం చూశాడు ఎలక్ట్రిక్ స్తంభానికి ఆనుకుని వున్న వ్యక్తి. నోట్లోని సిగరెట్ని క్రిందపడేసి బూటుకాలితో దాన్ని రుద్దాడు.

నెమ్మదిగా రోడ్ క్రాస్ చేసి, అపురూపా స్టోర్స్లోకి అడుగుపెట్టాడు.

2

''గుడ్ మార్నింగ్ బేబీ! మీ నాన్నగారు లేరా!'' అని అడిగాడు ఆగంతకుడు.

''ఉన్నారండీ! వారితో ఏం పనో చెబితే వారిని పిలవనంపుతాను'' సునీత భయంభయంగా అంది.

''అది పర్సనల్. ఆయనతోనే మాట్లాడాలి!''

''అలాగయితే కూర్చోండి! ఒక్క నిమిషంలో వస్తారు'' అంటూ తన ముందున్న టేబిల్కి అమర్చిన స్విచ్ నొక్కింది.

మేడమీద అలారం మ్రోగింది. కానీ సునీత తండ్రి ఆ సమయానికే లావెటరీకి వెళ్ళివున్నాడు. అందువలన అతడు వెంటనే రాలేదు.

కొద్ది క్షణాలు గడిచాయి. ప్యాకెట్ని తన ఒళ్ళోనే పదిలంగా పట్టుకుని కుర్చీలో కూర్చున్నాడు ఆగంతకుడు.

''బేబీ! మీ స్టోర్స్లో ఒక్క నిమిషం అంటే ఎంత సేపో తెలుపుతావా?'' అన్నాడు ఆగంతకుడు తన వాచీ చూసుకుంటూ.

''ప్రపంచంలో ప్రతిచోటా నిముషానికెంత సేపో

ఇక్కడా అంతేనండీ!" చాల తెలివిగా సమాధానం చెప్పాననుకున్నది సునీత.

అతడి చేతిలోని ప్యాకెట్ ని చూస్తుంటే సునీతకు అనుమానం కలుగుతోంది. అందులో కొంపదీసి ఏదైనా బాంబు లేదుకదా! పైగా మనిషేమో నిముషాల్ని లెక్క పెడుతున్నాడు. ఏ క్షణంలోనైనా అది పేలుతుందేమో!

సినిమాల్లో టైంబాంబు టిక్ టిక్ మనటం చూసింది సునీత చాలాసార్లు. అలాగే అతడు ప్యాకెట్ లోంచి టిక్ టిక్ అనే శబ్దం ఏదైనా వస్తున్నదేమో అని చెవులు రిక్కించి ఆలకించింది.

ఆగంతకుడు స్టోర్స్ లో నలుమూలలా కలయజూస్తున్నాడు. ఉన్నట్టుండి అతడు కుర్చీలోంచి ఎగిరిపడ్డాడు. భయాన్ని నటిస్తూ, రోడ్డుమీదకు చూశాడు ఒక్క సెకండు. ఒక్క దూకులో గ్రీస్ దేశపు జాడీ వెనక నక్కాడు.

"బేబీ! ఆ గుర్రాళ్ళు కాల్పులు జరుపుతున్నారు. నీవు చప్పున నేలబారుగా పడుకో!" అని అరిచాడు చాటు నుంచే!

అసలే అనుమానాలు పెనుభూతాలుగా ఆలోచిస్తున్న సునీత అతి వేగంగా టేబుల్ క్రిందకు దూరింది. రోడ్డు మీదనుంచివచ్చే తుపాకి గుళ్ళు తమ స్టోర్సులో ఎన్ని సామాన్లను ధ్వంసం చేస్తాయో అని ఆమె భయపడ సాగింది.

రెండునిముషాలు గడిచాయ్.

ఎక్కడో టక్ మన్న శబ్దం, ఆ తర్వాత ఎవరో పరుగెడుతున్నట్టుగా బూట్ల చప్పుడూ వినిపించాయి సునీతకు.

ప్రమాదం దగ్గరైనట్టు భయంతో కళ్ళు గట్టిగా మూసు కుంది.

ఆ తర్వాత ఇంకా ఏమీ జరగకపోవటంతో సునీత కళ్ళు తెరిచింది.

"ఏం సార్! ప్రమాదం గడిచినట్టేనా?" అనడిగింది, తనున్న చోటునుంచి లేవకుండానే.

అవతలినుంచి ఏ సమాధానమూ రాలేదు. గుండె నిబ్బరం చేసుకుని పైకి లేచింది సునీత. గ్రీస్ దేశపు జాడీ చాటున ఆగంతకుడు లేడు.

టేబుల్ కున్న స్విచ్ ని మరీ మరీ నొక్కింది సునీత. మేడమీద అలారం పదే పదే మ్రోగింది. సుకుమార్ హడావిడిగా దిగి వచ్చాడు స్టోర్స్ లోకి.

అదే సమయంలో స్కూటర్ మీద సుధీర్, రాజు ఇద్దరూ వచ్చారు.

3

భయంతో వణికిపోతున్న సునీతను చూసి "ఏం జరి గింది? ఏమయింది?" అనడిగారు.

సునీత కుర్చీలో కూలబడింది. రెండు చేతుల్లోను తల పట్టుకుని కూర్చుంది. సుధీర్ ఆమెకో గ్లాసు నీళ్ళందిం చాడు.

గటగటా గ్లాసెడు నీళ్ళు త్రాగాక సునీత మళ్ళీ తేరు కుంది. గుక్క త్రిప్పుకోకుండా గడగడా చెప్పసాగింది జరిగిన సంఘటన గురించి.

"అ గాగు! మరీ అంత స్పీడుగా చెబితే ఎలా? ఒక్కొక్క విషయం సాకలనంగా చెప్పు! అతడు మన స్టోర్స్ లో ఏదైనా కొనటానికి వచ్చానన్నాడా? లేక

దేన్నైనా అమ్మాలని వచ్చానన్నాడా?'' డిటెక్టివ్ ద్వయంలోని రాజు అడిగాడు.

''అదేం చెప్పలేదు! నాన్నను చూడాలన్నాడు. అంతే!''

''ఆ తర్వాత ప్రమాదం గురించి నిన్ను హెచ్చరించాడా? నీవు గూడా దాక్కున్న తర్వాత అతడు చల్లగా మన స్టోర్స్‌నుంచి బయటకు జారుకున్నాడన్న మాట!''

''అవును! వాడి వాలకం చూసి అప్పుడే అనుకున్నాను, వీడెవడో ఘరానా గజదొంగ అయి ఉండాలని! కానీ నామాటని అన్నయ్య లక్ష్యపెడితేనా?'' సునీత అన్నవంక కొరకొరా చూసింది.

''నిజమే అనుకుందాం! నీ కళ్ళుగప్పి, మన స్టోర్స్‌లోంచి వాడు ఏదైనా దొంగిలించటానికి వచ్చిన దొంగే అనుకుందాం! ఏ వస్తువు పోయిందో! డాడీ! మన స్టోర్స్‌లో వస్తువులన్నీ మీకు కంఠతాయేగా! ఏది పోయిందో చెప్పండి!'' సుధీర్ అన్నాడు.

సుకుమార్ పాపు అంతా ఒకసారి కలయ జూశాడు.

''ఆశ్చర్యంగా ఉందే! మన స్టోర్స్‌లో ఏ ఒక్క వస్తువూ పోలేదు. అన్నీ యథాతథంగా ఉన్నయ్'' సుకుమార్ ఆశ్చర్యంగా చూశాడు.

''అయితే నా అనుమానమే నిజం!'' సునీత భయంగా అంది.

''ఏమిటి అది?'' ముగ్గురూ ఏక కంఠంతో అడిగారు.

''వాడి చేతిలోని ప్యాకెట్‌లో ఏదో బాంబు ఉంటుంది. నా కళ్ళుగప్పి, వాడు దాన్ని మన స్టోర్స్‌లో ఎక్కడో దాచిపెట్టి పారిపోయాడు.''

ముగ్గురి నవ్వుతో స్టోర్స్ మారు మ్రోగిపోయింది.

"చాల్లే సునీతా! మరీ వెర్రిగా మాట్లాడకు. మన స్టోర్స్‌ని ప్రేల్చేయాలని ఎవరికి ఉంటుంది. మనకేం ప్రత్యర్థులు లేరు ఈ వ్యాపారంలో. నాన్నగారికిగూడ ఎవరూ ఆగర్భ శత్రువులు లేరు!" సుధీర్ బదులు చెప్పాడు.

"నా మాటలు ఎవరూ వినరు. ఎందుకైనా మంచిది. ఒకసారి స్టోర్స్ అంతా కలయజూడండి!"

నలుగురూ స్టోర్సు అంతా వెదికారు. గ్రీస్ దేశపు జాడీలో అడుగున పెద్ద గుడ్డపదేనీ ఉంది. దాంతో అప్పుడప్పుడు ఆ జాడీమీది దుమ్ము దులుపుతుంటారు. అందువలన ఎవరికీ దాని క్రింద ఏముందో అనుమానం రాలేదు. ఆ గుడ్డను తొలగించి చూడలేదు.

"బాంబ్ దొరికిందా షెర్లాక్ హోమ్స్‌గారూ?' అంటూ అన్నను వెక్కిరించింది సునీత.

సుధీర్ ఆమె మాటల్ని పట్టించుకునే స్థితిలో లేడు. నేలమీదకు వంగి పరీక్షగా చూస్తున్నాడు. అక్కడ నేల మీద బంగారు రంగులో మెరిసిపోతున్న అపురూపమైన పక్షి ఈక పడివుంది.

ఆ ఈకను చేతిలోకి తీసుకున్నాడు సుధీర్. అందరూ దానివంకే ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"మన పరిశోధనకు ఈ ఈక ముఖ్యమైన ఆధారం!" సుధీర్ గర్వంగా అన్నాడు.

"కానీ అతడి చేతిలో ఈక ఏమీ లేదే?" సునీత అడ్డు చెప్పింది.

"ఈ ఈక ఏదో రహస్య సంస్థకు సంకేతమై వుంటుంది. ఆగంతకుడు తన తొందరలో దీన్ని ఇక్కడ వదిలిపోయి వుండాలి. పొరబాటున అతడికి తెలియ

మండానే జారిపోయి వుంటుంది. అయితే ఏ సంస్థ ఈ సంకేతం సంబంధించిందో మనం కనిపెట్టవలసిన విషయం!" ఈకను పైకెత్తి పట్టుకొని అందరకూ చూపిస్తూ అన్నాడు సుధీర్.

"ఈ ఈక మనదేశానికి చెందిన పక్షిది కాదని నేను ఘంటాపథంగా చెప్పగలను" సుకుమార్ వక్కాణించాడు.

"ఎందుకు అనవసర వాదనలు. కార్బన్ టెస్టు చేసి చూస్తే దీని విషయం బయటపడదూ?" రాజు ప్రతిపాదించాడు.

"అదీ అసలు సంగతి. పదరాజా! కాలేజీ లేబరేటరీకి వెళ్ళివద్దాం" అంటూ రాజును ఎక్కించుకుని స్కూటర్ని స్టార్టు చేశాడు సుధీర్.

"నీవు భయంతో నలిగిపోయావు పాపా! పైకివెళ్ళి విశ్రాంతి తీసుకో! స్టోర్స్‌లో నేను కూర్చుంటాలే!" అన్నాడు సుకుమార్.

సునీత మేడమీదకు వెళ్ళిపోయింది. సుకుమార్ కుర్చీలో కూర్చుని ఏదో ఇంగ్లీషు సైన్సు గ్రంథాన్ని చదటంలో మునిగిపోయాడు.

రాత్రివేళకు సుధీర్, రాజు ఇల్లు చేరారు.

"డాడీ! అది ఏ పక్షిదో అంతుపట్టలేదు. లైబ్రరీకి వెళ్ళి పక్షులకు సంబంధించిన గ్రంథాలుగూడ తిరిగేశాం. లాభం కనబడలేదు. నాగరిక ప్రపంచంచూడ. నోచుకొని పక్షిదన్నా అయివుండాలి ఆ ఈక, లేదా చాలా ఏళ్ళ క్రితమే అంతరించిపోయి అయినా వుండాలి ఈ ఈక కలిగిన పక్షి" అన్నాడు సుధీర్ భోజనాలముందు.

"పోనీ లెద్దూ! అంతుపట్టని ఆ ఈక గురించి ఇంత శ్రమపడడం దేనికిరా?" సుకుమార్ త్రోసి పుచ్చాడు.

4

రాత్రి పదకొండు గంటలు దాటింది. అమావాస్య రాత్రి కావటంవలన చీకటిగా వుంది. ఆ రోడ్డులో ట్యూబ్ లైట్లు కొన్ని వెలుగుతున్నయ్. కొన్ని వెలగటం లేదు. మరికొన్ని వెలిగి ఆరిపోవటం, ఆరిపోయి వెలగడం చేస్తున్నయ్.

ఏదో చిన్నగా అలికిడి అయింది. సుధీర్ కు చప్పున మెలకువ వచ్చింది. ప్రక్క బెడ్ మీదున్న రాజుని తట్టాడు. కానీ రాజు అప్పటికే కళ్ళు తెరిచివున్నాడు.

"క్రింద ఏదో శబ్దం అయినట్టులేదూ?" అనడిగాడు రాజు.

"అవునురా! నాకూ ఆ చిన్న అలికిడికే మెలకువ వచ్చింది" సుధీర్ బెడ్ మీద నుంచి లేస్తూ అన్నాడు.

గోడగడియారం టిక్ టిక్ మంటున్నది.

ఎక్కడో కిర్రుమని తలుపు తెరుచుకున్న చప్పుడు వినిపించింది మళ్ళీ.

ఇద్దరూ వులికిపాటుతో కిటికీలు తలుపులవంక చూశారు. అన్నీ వేసినవి వేసినట్లే వున్నాయ్.

"క్రింద స్టోర్స్ లో ఎవరైనా ప్రవేశిస్తే, బర్గ్లర్ అలారం మ్రోగాలి గదా?" సుధీర్ తన అనుమానాన్ని వ్యక్తంచేశాడు.

"ఏమో! దాన్ని మ్రోగకుండా చేశాడేమో ఆ దొంగ! ఈ రోజుల్లో మామూలు దొంగలు కూడా ఆరితేరి పోతున్నారు. రహస్య సంస్థల మెంబర్లయితే యిక చెప్ప నక్కర్లేదు."

ఇద్దరూ బెడ్స్‌మీద నుంచి లేచారు.

"అంకుల్ ని కూడా లేపుదామా?" రాజా అడిగాడు.

"వద్దు! ఆయనతో బాటుగా సునీత కూడ మేల్కొం టుంది. పగలంతా అసలే భయపడిపోయింది. ఇప్పుడీ సంగతి వింటే అది యింకా బెంబేలు పడుతుంది."

ఇద్దరూ అడుగులో అడుగు వేసుకుంటూ, మెట్లు దిగారు. బయట మంచు పడుతోంది. ఏమీ కనబడటం లేదు.

స్టోర్సులోకి అడుగుపెట్టారిద్దరూ. తమ ఊహాల్ని అను మానాల్ని నిజంచేస్తూ, స్టోర్స తలుపు వారగా వేసివుంది. దాని తాళం పగులగొట్టబడింది. బర్గ్లర్ అలారం కూడ చెడగొట్టబడివుంది.

ఏమాత్రం శబ్దం కాకుండా తాళాన్ని ఛేధించటం అంత సులభమా? అయితే దాన్ని విరగ్గొట్టేందుకు యేదో ద్రావకాన్ని ఉపయోగించి వుండాలి. అంటే ఆగంతకుడు ఆధునిక పరికరాల్ని సైతం ధ్వంసంచేసే నేర్పరి అయి వుండాలి.

"తాళం చూశావా? బర్గ్లర్ అలారమ్ సైతం ధ్వంసం అయింది" రాజా చెవిలో చెప్పాడు సుధీర్.

లైటు వెలిగించకుండానే, ఇద్దరూ చీకట్లో ముందుకు పోతున్నారు. ఆ స్టోర్స్‌లో ప్రతిఅంగుళమూ వాళ్ళకు తెలుసు గనుక చీకట్లోకి కూడా దేనికీ గుద్దుకోకుండా నడుస్తున్నారు.

సుధీర్ ముందు నడుస్తున్నాడు పిల్లిలా. అతడ్ని అనుస రిస్తున్నాడు రాజా. ఆ నడవడంలో ఒకచోట రాజా కాలు జారి పడ్డాడు. అతడు పడడంలో ఏదో ఫ్లవర్ వేజ్ ని క్రిందకు పడదోశాడు.

పెద్దశబ్దంతో ఫ్లవర్ వేజ్ క్రిందపడి ముక్కలైపోయింది. ఆ శబ్దానికి స్టోర్స్‌లో మరో చివర అలికిడైంది. ఏదో క్లిక్ మన్న శబ్దం వచ్చింది.

“రాజా! నేలబారుగా పడుకో!” అన్నాడు చిన్నగా సుధీర్, తనూ నేలమీద వాలిపోతూ.

సుధీర్ ఊహ నిజమైంది. అతడి హెచ్చరిక సకాలంలో వచ్చింది. స్టోర్స్ మరో మూలనుంచి తుపాకీ ప్రేలింది. శబ్దంతోపాటు మంటగూడ వచ్చింది. వరుసగా రెండు బుల్లెట్లు వాళ్ళమీద నుంచి తలుపులోకి దూసుకుపోయాయి.

ఆ వచ్చింది మామూలు దొంగకాదు. హంతకుడు గూడా! అతడికి కావలసిని వస్తువును సాధించుకుపోవటానికి ఎంతమందినైనా చంపటానికి వెనుదీయని గుండెలు దీసిన బంటు.

అంత క్రౌర్యానికి తెగించి, తమ స్టోర్స్‌లోంచి తీసుకు వెళ్ళవలసిన వస్తువు ఏమైవుంటుందా అని సుధీర్ తల బ్రద్దలు కొట్టుకుంటున్నాడు.

“రాజా! నీవు తలుపుదగ్గర కాపలా వుండు. నేను వాడ్ని తరుముకొస్తాను” సుధీర్ నేలమీద ప్రాకుతూ అన్నాడు.

రబ్బరుబూట్లు చకచక నడిచినయ్. ఆగంతకుడు తలుపు వైపుగాపోలేదు. మరో ప్రక్కనున్న కిటికీ తలుపు ధఢాల్న తెరిచాడు. ఆ కిటికీకి ఊచలులేవు. కిటికీలోంచి గభాల్న బయటకు దూకాడు ఆగంతకుడు.

ఆ కాస్త వెలుగులో ఆగంతకుడి ముఖం గుర్తుపట్టలేకపోయాడు సుధీర్. కానీ అతడి డ్రెస్ చూస్తుంటే, ఆ ఆకారం ముమ్మాటికీ ఉదయం ఎలక్ట్రిక్ స్థంభానికి

అనుకున్న వ్యక్తిది. తన చెల్లెలు అనుమానించిన దుర్మార్గుడిదే.

అతడి కుడిచేతిలో లాంగ్ బ్యారల్ రివాల్వర్ వుంది. మరో చంకలో తాను ఉదయం ఆగంతకుడి చేతిలో చూసిన ప్యాకెట్ వుంది.

క్షణాల్లో ఆగంతకుడు చీకట్లో కలిసిపోయాడు.

5

అపురూపా స్టోర్స్‌లో మర్నాడుదయం మళ్ళీ వెతుకులాట ప్రారంభించారు సుధీర్, రాజు. తలుపులోంచి దూసుకుపోయి రోడ్డుమీద పడిన బుల్లెట్స్ తప్ప, మరే ఆధారమూ దొరకలేదు.

"ఇంతకీ ఆ వ్యక్తి పగలు మన స్టోర్స్‌లోకి ఎందుకు వచ్చినట్టు, ఎందుకు వెళ్ళినట్టు? మళ్ళీ రాత్రికి యెందుకు ప్రవేశించాడు? యివన్నీ అంతుదొరకని పజిల్స్‌లాగా వున్నయ్."

"మన స్టోర్స్‌లో ఏ వస్తువుని దొంగిలించాలో పగటి పూట ఎన్నిక చేసుకోవటానికి వచ్చివుంటాడు. దాని కోసమే రాత్రి వచ్చాడేమో! మధ్యలో మనం రావటంతో పారిపోయివుండాలి" రాజు తన ఊహాల్ని బయట పెట్టాడు.

"ఆగంతకుడు షాపులోకి వచ్చిన మాట నిజమే! కానీ మన వస్తువులు దొంగిలించేందుకు మాత్రం కాదు! నిన్న ఉదయం అతడ్ని చూసినప్పుడు అతని చేతిలో యేదో ప్యాకెట్ వుంది. దాన్ని అతడు ఎక్కడనుంచో దొంగిలించి తెచ్చి వుండాలి! అతడి వెనుక ఎవరో వెంటాడుతూండడాన్ని గమనించి, ఆగంతకుడు తన ప్యాకెట్‌ని మన స్టోర్స్‌లో దాచాడు. తనను వెంటాడే వాళ్ళ పీడ

వదిలించుకున్నాడు. రాత్రి వేళ మళ్ళీ స్టోర్స్‌లో జొరబడి తను దాచిన వస్తువుని తీసుకెళ్ళేడు. అందుకే మన స్టోర్స్‌లోని ఏ ఒక్క వస్తువూ పోలేదు'' సుధీర్ పెద్ద పోజు పెట్టాడు.

''నీ ఊహ బాగానేవుంది. అతడికి సంబంధించిన ప్యాకెట్‌లో చాలా అపురూపమైన వస్తువే వుండి వుండాలి. దానికోసం అతడు హత్యలు చేసేందుకు గూడ వెనుకాడలేదు'' సుకుమార్ తన కొడుకును బలపరిచాడు.

''మరి మనకు దొరికిన బంగారు రంగు ఈకను ఆధారం చేసుకుని, ఆ రహస్య సంస్థను బయటకు లాగవచ్చు!'' సునీత ఈకను గుర్తుచేస్తూ అంది.

వారి సంభాషణకు అంతరాయం కలిగిస్తూ స్టోర్స్‌లోకి మరో నూతనవ్యక్తి ప్రవేశించాడు.

అతను అజానుబాహువు. తెల్లని ప్యాంటు, ఎర్రని షర్టు, ఆకుపచ్చని టై, తెలుపురంగు కోటూ, ఈవెనింగ్ హ్యాట్ పెట్టుకుని వున్నాడు. మనిషి నల్లగా నీగ్రోజాతి వాడిలా వున్నాడు. అతడి ముఖంలో ఏవిధమైన భావావేశాలూ లేవు. గంభీరంగా వున్నాడు.

కోటు పైభాగంలో, బంగారు రంగు ఈక గుచ్చబడి వుంది.

ఈ నూతనవ్యక్తిని చూసి అందరూ నిశ్చేష్టులై నిలబడ్డారు. ఈ వ్యక్తి మిత్రుడా లేక శత్రువా?

'క్షమించండి! మీ చర్చకు అడ్డు తగిలినట్టున్నాను. నా పేరు మామో! అండమాన్ ద్వీపాల్లో మారుమూలదైన కఠోరా ద్వీపం మాది. అక్కడ ఎల్లప్పుడు వేడిని వెదజల్లే అగ్నిపర్వతం ఉండడంవల్ల నాగరిక ప్రపంచం మా జోలికి రాలేదు. మా ఆటవిక సంప్రదాయాల్ని నాశనం

కాకుండా యిప్పటి వరకూ కాపాడుకు వస్తున్నాం!'' అన్నాడు మామో.

''అలా కుర్చీలో కూర్చోండి!'' అన్నాడు సుకుమార్. అగ్నిపర్వతం సంగతి వినగానే అతడిలో ఉత్సాహం వచ్చింది.

''ఇలాంటి బంగారు రంగు ఈకను నిన్నగాని లేక యివాళగానీ మీరు చూసివుండాలి'' అనడిగాడు మామో.

''అవును! నిన్న వుదయం ఒక నూతనవ్యక్తి చేతిలో పెద్ద ప్యాకెట్‌తో మా స్టోర్స్‌లోకి వచ్చాడు. తన ప్యాకెట్‌ని మాకు తెలియకుండానే, మా స్టోర్‌లోనే దాచాడు. మళ్ళీ రాత్రికి తలుపుబద్దలుకొట్టి ప్రవేశించాడు. అడ్డగించబోయిన మాపై కాల్పులు జరిపాడు. తనవస్తువును తాను ఎత్తుకుపోయాడు'' సుధీర్ జరిగిన విషయం చెప్పాడు.

''నేనతన్ని అనుసరిస్తూనే వున్నాను. కానీ క్షణాల్లో అతడు కనుమరుగైపోయాడు.''

''ఆ ప్యాకెట్‌లో ఏముందో మీకు తెలుసా?'' రాజా అడిగాడు.

''తెలును! కకోరా ద్వీపంలో ఆటవికులకు నేను నాయకుడ్ని. మాకు అతిపురాతనమైనదీ, అపురూపమైనదీ అయిన వైఢూర్య కిరీటాన్ని ఆ దుర్మార్గుడు కాజేసుకుని వచ్చాడు. దానికి బంగారు రంగుగల ఈకలు కొన్ని తగిలించి వున్నయ్ గూడ. బహుశా దాన్ని మీకు అమ్మి డబ్బుచేసుకుని పోదామని మీ వద్దకు వచ్చాడేమో!''

''మా వద్దకు అమ్మేందుకు ఏ వస్తువుని ఎవరు తెచ్చినా సరే, అది అతడిదేనని ఋజువు పరచేవరకు మేం దాన్ని కొనం!''

"చాల సంతోషం. మీ అబ్బాయిలు డిటెక్షన్ పనులుగూడ చేస్తుంటారని విన్నాను. మీరెలాగయినా సరే ఆ కిరీటాన్ని మళ్ళీ మాకు అప్పగిస్తే, అందుకు తగిన బహుమానాన్ని ఇచ్చుకోగలను."

సుధీర్ రాజాలు చంక లెగరేశారు.

"ఆ వైఢూర్య కిరీటం వెల అమెరికన్ మార్కెట్లో మిలియన్ డాలర్లు. అంతేకాదు. క్షణాలు దొర్లేకొద్దీ ఆ కిరీటం చేతులు మారి మానుంచి అంతకంతకూ దూరమయే ప్రమాదం వుంది. పైగా మా ప్రజల్లో మరో ప్రగాఢ నమ్మక మొకటుంది."

"ఏమిటది?"

"ఆ కిరీటంలో ఏవో అద్భుత శక్తులున్నాయనీ, ఆ శక్తులే మా దీవిని, మా ప్రజల్ని ఎల్లప్పుడూ కాపాడుతున్నాయనీ వాళ్ళ నమ్మకం. మాకందరికీ సలహాదారు మాంత్రిక శక్తుల్ని వశం చేసుకున్న స్త్రీ "కహునా" చెప్పిన మాటలివి.

"అందుకే ఆ కిరీటం అదృశ్యమయిన కొద్దిక్షణాల నుంచి మా ప్రజలలో నిరాశ ఆవరించింది. ఈ పరిణామం వల్ల ప్రజల్లో చాలామంది చనిపోవటమో, లేక అగ్ని పర్వతం బ్రద్దలై దీవి నేలమట్ట మయేందుకు యిది వొక్క దుశ్శకునమో అనీ భావిస్తున్నారు." మామో ఆవేశంగా చెప్పుకు పోతున్నాడు.

"బాగానేవుంది. నాయకుడుగా మీ ఆదుర్దాను మేం అర్థం చేసుకోగలం. ఇంతకీ ఆ కిరీటాన్ని ఎవరు కాజేసి వుంటారు? మీ అనుమానం ఎవరిమీదవుంది?" సుకుమారడిగాడు.

"నెల క్రితం మా దీవికి ఒకవ్యక్తి వచ్చాడు. అతడి వెంట ఇంకా ఇద్దరు అనుచరులున్నారు. ఏవో భూగర్భ పరిశోధనల గురించి వచ్చామన్నారు. ఎవరికీ అనుమతి యివ్వని మాంత్రికురాలు "కహునా" వాళ్ళని అందుకు అనుమతించింది.

"వాళ్ళు అగ్నిపర్వతం దగ్గర రహస్యగుహాలో వున్న కిరీటాన్ని చూశారు, అక్కడవుండే భటుల్ని వంచించి. మరో వారం తర్వాత కిరీటం మాయమయింది. గుహకు కాపలా కాస్తున్న ఇద్దరు ఆటవికులూ చంపబడ్డారు. ఆ రకంగా రెండువందల యాభైసంవత్సరాలనుంచీ మా దీవి దాటిపోని వైఢూర్య కిరీటం మాయమయింది."

"మీరా దొంగల్ని వెంటాడుతూ వచ్చారా?"

"అవును."

"ఇంతకీ ఆ వ్యక్తి ఎవరో చెప్పగలరా?"

"మిస్టర్ విలియం బ్రూక్స్! అతడి నివాసం మద్రాసులోనే. వాడి అనుచరుడు రాబర్ట్."

"మాకు తెలుసు అతడు! అతడు బ్రూక్స్ కాదు, బ్రూక్! అతడు ప్రయివేటుగా జూ, జంతుప్రదర్శన శాలను నడుపుతున్నాడు. కానీ తెరవెనుక మొసళ్ళ చర్మాల్ని, పాము చర్మాల్ని విదేశాలకు పంపుతుంటాడు పెద్ద లాభాలకు."

6

ఆ తర్వాత సుధీర్, రాజులు తమ పరిశోధనలో విలియమ్ బ్రూక్స్, అతడి అనుచరులు అరోజా ఫ్లైట్ కే అండమాన్స్ కి వెళ్ళినట్టు తెలుసుకున్నారు.

"ఇక నేం! ఆ దొంగలందరూ తిరిగి కకోరా దీవిలోకే వెళ్తారు. కలుగులోని ఎలుకల్ని పట్టినట్టుగా వాళ్ళా దీవి

నుంచి బయటపడకముందే మనం వాళ్ళను పట్టుకోవాలి. ఆ కిరీటాన్ని దక్కించుకోవాలి'' సుధీర్ యెగిరి గంతేశాడు.

''అయితే ఆ దుండగులు మా దీవిలోని సంపదలను కొల్లగొట్టుకొచ్చుకోవడానికి మళ్ళీ వెళ్ళారన్న మాట,'' మామో తన కోటుజేబులోంచి చిన్న గుడ్డసంచీనితీశాడు. అందులో బంగారు కాసులున్నాయి.

''మీ కరెన్సీ మాకు లభ్యంకాదు. అందుకే బంగారాన్ని ఇస్తున్నాను. ఇవన్నీ కలిపి పదివేల రూపాయలు అవతయ్. మీ ఖర్చులకు ఇవి. కిరీటం మాకు అందించేక మరో మొత్తాన్ని ఇవ్వగలను!''

''థాంక్స్ మిస్టర్ మామో! మనకు ఆట్టే టయిము లేదనుకుంటాను.''

వెంటనే సుధీర్ ఏయిర్ లైన్స్ ఆఫీసుకివెళ్ళి అయిదు టిక్కెట్లు రిజర్వ్ చేసుకువచ్చాడు, తర్వాతి ఫ్లైట్ కి.

8

పోర్టుబ్లయర్ లో మోటారుబోట్ ఒకటి అద్దెకు తీసుకొని ఐదుగురు 'కకోరా దీవి'కి చేరుకున్నారు.

రాత్రి గాఢాంధకారం. కీచురాళ్ళ రొదతో మరీ భయంకరంగా వుంది.

అగ్నిపర్వతం వేడివలన అక్కడి అడవుల్లో పాములు గానీ, క్రూరమృగాలుగాని లేవని నాయకుడు చెప్పాడు. అగ్నిపర్వతం చాలా సంవత్సరాల క్రితమే ప్రేలిపోయిందట. ఇప్పుడది ప్రమాదభరితం కాదన్నాడు.

అడవి ప్రక్కగా ప్రయాణించారు తెల్లారేదాకా. సంవత్సరాలక్రితం అగ్ని పర్వతంనుంచి స్రవించిన లావా పీఠభూమిపై వాళ్ళు నడుస్తున్నారు.

తెల తెలవారుతుండగానే పక్షుల కిలకిలారావాలతో ప్రకృతి మేలుకొంది.

సుధీర్, రాజా ఇద్దరూ సన్నగొంతుతో కబుర్లు చెప్పు కుంటూ వెనుకగా నడుస్తున్నారు. మాటల్లో వారిద్దరు దారి ఎప్పుడు తప్పారో చూసుకోలేదు.

ఇద్దరూ దారి తప్పామని తెలుసుకున్నాక, దాపునే వున్న ఒక కొండగుట్ట ఎక్కి చుట్టూ పరికించసాగారు. కొండ క్రిందుగా ఏదో రాయి దొర్లింది. జరాజరా క్రిందకి దొర్లుకుంటూ పోయింది.

ఇద్దరూ క్రిందకు వంగి చూశారు.

ఎవరో వ్యక్తి కొండ ఎక్కుతున్నాడు. అతడి కాలు ఏదో కదులుగావున్న రాయిమీద పడింది. రాయి దొర్లి పోయింది. ఆ వ్యక్తి పడబోయి తమాయించుకున్నాడు.

అతడి చేతిలో రైఫిల్ వుంది. చంకకు వ్రేలాడుతున్న సంచిలో సగం ప్యాకెట్ బయటకు కనబడుతున్నది.

"వెదకబోయిన తీగ కాలికి తగిలిందంటే ఇదేమరి. వాడే రాబర్ట్." సుధీర్ ఆశ్చర్యంగా చూశాడు.

"అలా ఆ దోవనపోతే మనం త్వరగా వాడ్ని అడ్డ గించగలం!" అన్నాడు రాజా ఆనందంగా.

"వెంటనే పద. కానీ వేసే ప్రతి అడుగూ జాగ్ర త్తగా చూసివెయ్యి. మనకాలు తగిలి ఏదయినా రాయి దొర్లిందో వాడూ మనల్ని ఇట్టే కనిపెట్టేస్తాడు. పైగా వాడిచేతిలో రైఫిల్ వుంది చూశావా!" సుధీర్ హెచ్చ రించాడు.

కానీ కొండ ప్రాంతాల్లో ఎంత జాగ్రత్తగా నడచినా కాలు జారక మానదు. చిన్నదో చితకదో రాయి క్రిందకు దొర్లక తప్పదు. రాజా కాలుతగిలి ఒకరాయి క్రిందకు దొర్లింది.

క్రిందినుంచి కొండ యెక్కుతున్న రాబర్ట్ వులిక్కిపడ్డాడు. వెంటనే ఆ శబ్దంవచ్చిన వేపుగా గురిచూసి రైఫిల్ ని కాల్చాడు.

ఆ దెబ్బ సుధీర్, రాజులకు తగలలేదు. కానీ మరో రాయికి తగిలింది. పెళుసురాయి అవటంవలన పెంకులు గాలిలోకి లేచి పడినయ్.

సుధీర్, రాజులు మరో ప్రక్కనుంచి నక్కుతూ ముందుకు వెళ్ళారు. ఒక్కక్షణం గడిచేక రాయిచాటు నుంచి క్రిందకు చూశారు.

అక్కడ రాబర్ట్ లేడు.

"వాడు ఏదో ప్రమాదాన్ని పసిగట్టి, తనదోవమరల్చుకొని వుంటాడు! ఎలాగిప్పుడు?" రాజు నొచ్చుకున్నాడు.

ఇద్దరూ చాటుమాటుగా నక్కి నేలమీద ఎగబ్రాకుతున్నారు. రాబర్ట్ ఎక్కడయినా కనబడతాడేమో అని వెయ్యికళ్ళతో వెతుకుతున్నారు.

అన్ని వేపులా వెతికి వేసారి ఒక గుహదగ్గరకు చేరుకున్నారు.

"వాడి చేతిలో రైఫిల్ వుంది. మనకోసం వాడు ఎక్కడో మాటు వేసుకొని కూర్చున్నాడని నా అనుమానం" అన్నాడు సుధీర్.

"ఈగుహ ఎక్కడకు పోతుందో లోపలకు వెళ్దామా" రాజు గుహలోకి చూశాడు.

"ఏమీ చెప్పలేం! కొన్ని గుహలు మరో మార్గం లేకుండా మధ్యలోనే అంతమవుతాయి. మరికొన్ని మలుపులు తిరిగి కొండ మరోవైపుకు తీసుకువెడతాయి."

8

ఇద్దరూ గుహలో నడవసాగారు. కొంతదూరం పోయే సరికి నడవ మరీ సన్నమయింది. ఒక్కరు మటుకే దూరే త్రోవ వుంది.

ఆ త్రోవనే మరో నాలుగడుగులు ముందుకు వెళ్లేసరికి వెలుతురు కనిపించింది. చప్పుడు చేయకుండా జాగ్రత్తగా ముందుకు పోతున్నారు.

ఆ దోవ మరో గుహ ప్రదేశానికి దారితీసింది. గుహ ద్వారంలో రాబర్ట్ నిలబడి కొండక్రిందకు చూస్తున్నాడు రైఫిల్ చేతులో పుచ్చుకొని.

సుధీర్, రాజా ఇద్దరూ కళ్ళతోనే సైగ చేసుకున్నారు. చేతులమీదా, మోకాళ్ళమీదా ప్రాకుతూ వెళ్ళారు.

పాము చెవులు రాబర్టువి. ఈ కొత్త అలికిడిని పసిగట్టనే పసిగట్టాడు. గభాల్న వెనుదిరిగి చూశాడు.

సుధీర్ నేలమీద రాళ్లుతీసి అతడిపై రాళ్ళవర్షం కురిపించాడు. రాజా గుప్పిళ్ళతో మట్టినితీసి రాబర్ట్ మొఖాన విసిరాడు.

రాబర్ట్ రైఫిల్‌ని గురిపెట్టి కాల్చాడు. అంతలో సుధీర్ విసిరిన రాళ్లు తగిలినాయి. గురి తప్పిపోయింది. రైఫిల్ పొజిషన్ మారింది. పై కప్పులోకి రెండుగుళ్ళు దూసుకు పోయినాయి. రాళ్ళవర్షం కురిసినట్టుగా పై కప్పులోని లూజ్ రాక్ నేల రాలింది.

ఇదే తగిన అదనుగా, సుధీర్ బులెట్‌లా దూసుకు పోయి తన తలతో రాబర్ట్ కడుపులో గుద్దాడు. రాబర్ట్ నేలమీద వెల్లకిలా పడిపోయాడు. రాజా అతడి మీదకెక్కి గుద్దుల వర్షం కురిపిస్తున్నాడు.

నేలమీద పడిపోయిన రైఫిల్‌ని అందుకున్నాడు సుధీర్.

"రాస్కెల్! మామీదే కాల్పులు జరుపుతావురా! నిన్నేం చేస్తామో చూడు" అన్నాడు కసిగా.

సుధీర్ ఒకప్రక్కగా పడిపోయిన పార్సెల్‌ని అందుకున్నాడు. ఆ అట్టపెట్టె మూతతీసి చూశాడు. కాంతులీనుతూ వైఢూర్య కిరీటం మెరిసిపోతోంది లోపల. తిరిగి దాన్ని మూసేశాడు. ఈ రాబర్టుపీడ విరగడ చేసేస్తే, ఇక తాము తాపీగా మిగతాపని చూసుకోవచ్చు.

రాబర్టుని కట్టిపడేసేందుకు ఏదయినా తాడు దొరుకుతుందేమో అని అన్నివేపులా చూశాడు సుధీర్. కానీ విధి వారికి వ్యతిరేకంగా వుంది.

ఇంతక్రితం రాబర్టు పై కప్పులోకి ప్రేల్చినచోట మళ్ళీ సంచలనం మొదలయింది. పైనుంచి రాళ్లూ, మట్టీ పడసాగాయి. కొంపదీసి భూకంపం రాలేదుకదా అనుకున్నారు.

పైకప్పులో పెద్దరంధ్రం ఏర్పడింది. అందులోంచి మట్టిపడిన తర్వాత ఒకయువతి జారి క్రిందపడింది. ఆమె బెల్‌బాటమ్ ప్యాంటూ, స్లాకూ వేసుకునివుంది.

"ఎవరూ? సునీతా! నీవా?" సుధీర్ ఆశ్చర్యపోయాడు.

"ఏమయినా దెబ్బలు తగిలాయా?" అంటూ రాజు ఆమెకు చేరువగావెళ్ళి, చేయూతనిచ్చి లేవదీశాడు.

అంతే! రాబర్టు పిడికిలి బిగించి సుధీర్ వెన్నులో గుద్దాడు. సుధీర్ పడిపోయాడు నేలమీద. అతడి చేతిలోని రైఫిల్ దూరంగా పడింది. రాబర్టు దాన్ని అందుకున్నాడు.

సుధీర్ చెల్లెలు, సునీత డొక్కలో రైఫిల్ని ఆనించాడు.

“మీ చిట్టి చెల్లెలు ప్రాణాలతో వుండాలంటే, ఆ పార్సెల్ ఇటివ్వండి!” రాబర్టు కళ్ళు కర్కశంగా చూస్తున్నాయి. అతడి ముఖంలో క్రూరత్వం ఉట్టిపడుతోంది.

సునీతకు క్షణాల్లో పరిస్థితి అర్థమయింది. “అన్నయ్యా! రాజూ! పార్సెల్ని ఇవ్వవద్దు. అతడు కేవలం బెదిరిస్తున్నాడు. ఆడపిల్ల నెవరన్నా కాల్చి చంపుతారా? ఆ పార్సెల్లో వైఢూర్య కిరీటమే గనక వుంటే, నా ప్రాణాలు పోయినా ఫర్వాలేదు. దాన్ని మటుకు వదలుకోకండి” సునీత ఏడుస్తూ అంది.

“ఒరే! పంది వెధవా! నీవూ, నీ కిరీటమూ ఎట్లాగన్నా తగలబడండి. నా చిట్టి చెల్లెలికి అపకారం జరిగిందో నిన్ను ప్రాణాలతో వదలం!” సుధీర్ వెర్రిగా అరిచాడు.

రాబర్టు పార్సెల్ని అందుకున్నాడు. భుజానికున్న సంచిలో వేసుకున్నాడు దాన్ని. రైఫిల్తో అందర్నీ బెదిరిస్తూ “నేను పూర్తిగా ఇక్కడ్నుంచి వెళ్ళిపోయే దాకా ఎవరన్నా గుహ బయటకు వచ్చారో, వాళ్ళతలలు ఎగిరిపోతాయి” అని హెచ్చరించాడు.

వెనకగా అడుగులు వేస్తూ, రాబర్టు అక్కణ్నుంచి కనుమరుగయి పోయాడు.

సునీత భోరుమంది. “ఇదంతా నా మూలంగానే జరిగింది. చేతికి వచ్చిన కిరీటాన్ని తిరిగి మనచేతులతోనే దాన్ని ఆ దుర్మార్గుడికి అప్పగించాం. ఈ అనర్థానికంతా నేనే మూలం!” అంటూ ముఖాన్ని చేతుల్లో దాచుకొని ఏడుస్తోంది.

“ఊరుకో సునీతా! ఏడవకు. మనుష్యుల ప్రాణాల కన్నా ఆ కిరీటం విలువయినదేమీ కాదు. నిన్ను ముందు

రక్షించుకో గలిగితే ఆ కిరీటాన్ని మళ్ళీ సొరకబుచ్చుకో గలం!'' సుధీర్ చెల్లెల్ని ఓదార్చాడు.

''అవును సునీతా! మీ అన్నయ్యా చెప్పిందే నిజం. జరిగిపోయినదానికి విచారించి లాభంలేదు. సమయంమించి పోకముందే తిరిగి ఆ దుర్మార్గుడ్ని పట్టుకోవాలి, పదండి,'' రాజు కర్తవ్యాన్ని గుర్తు చేశాడు.

ముగ్గురు మళ్ళీ నడక సాగించారు.

''నీవు జారిపడినప్పుడు భలేగా భయపడ్డాంలే భూకంపం వచ్చిందేమో అని.బహుశా ఒకటిజరిగివుండాలి. పైకప్పు చాలా దళసరిగా వుండివుంటుంది. రాబర్టు కాల్పులవలన రాయిపగిలి పెళ్ళలు పెళ్ళలుగా రాలింది. అదే సమయంలో పైన ఆ భాగంలో నడుస్తోన్న సునీత పైనుంచి జారి క్రిందపడింది.'' సుధీర్ ఊహాగానాన్ని వ్యక్తం చేశాడు.

''అడవిలో నేనూ దారితప్పి కొండ ఎక్కుతున్నాను. రైఫిల్ షాట్ వినిపించి, ఒక గుహలో దూరాను. ఆ మార్గంనుంచే వస్తూండగా మళ్ళీ రైఫిల్ షాట్ వినిపించింది. వెంటనే కాళ్ళకింద నేల విచ్చిపోసాగింది...'' చెప్పింది సునీత. ఆమె భయం ఇంకా పూర్తిగా తొలగి పోలేదు.

9

ఎత్తయిన ప్రదేశంలో నిర్మింపబడిన విశాలమైన గుడిసె ముందు దీవి నాయకుడు మామో, అతడిప్రక్కన సుకు మార్ కూర్చునివున్నారు.

సుధీర్, రాజులను చూస్తూనే వారు ఆనందించారు. ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే సుధీర్, రాజులకూడ

సుకుమార్‌నీ, మామోని ప్రశ్నలతో నింపేశారు. తరువాత రాబర్టుతో తమ అనుభవం చెప్పారు.

"వాడు అశపాతకుడు. మా దీవిలో ఇంకా యేమేం అపురూప మయిన వస్తువులున్నాయో తస్కరిద్దామని వచ్చాడు," మామో పళ్ళు కొరికాడు.

"మనం త్వరపడితే తప్ప, రాబర్టు చేతిలోంచి కిరీటం క్షణాల్లో ఈ దీవినుంచి వదిలిపోవటం ఖాయం."

"ఇక మీరు విశ్రాంతి తీసుకోండి, మా దీవిలో చేరిన దుర్మార్గుల్ని దీవిదాటి పోనిస్తామా! ఇప్పటికే మీరు ప్రాణాలకు తెగించి సాహసం చేశారు. ఆ కిరీటం ఎక్కడుందో ఎవరి దగ్గరుందో చెప్పారు. ఇక పరిస్థితిని నేనే ఎదుర్కొంటాను" మామో ఆవేశంగా అన్నాడు.

"ఇంతవరకూ వచ్చాక మిమ్మల్ని ఒంటరిగా వదిలేస్తామా? పైగా ఆ రాబర్ట్ చేతిలో రైఫిల్ కూడా వుంది."

"సుధీర్! మామో చెప్పేది నిజం! ఇక మీరు విశ్రాంతి తీసుకోండి!" సుకుమార్ లాలనగా అన్నాడు.

"అదేమిటి డాడీ మీరు అలానే అంటారు. అక్కడ శత్రువులు ముగ్గురు! ఇంతమందినీ నాయకుడొక్కడే ఎదుర్కోగలడా?" సుధీర్ అనుమానంగా చూశాడు.

"ఒక్కడే వెడతాడని ఎవరన్నారు? అతడివెంట నేనుంటాను. రాబర్ట్ రైఫిల్‌కి నా రివాల్వర్‌తో సమాధానమిస్తాను."

మామో, సుకుమార్ అక్కణ్నుంచి వెళ్ళిపోయారు.

నేలమీద గడ్డిని పీకుతూ కూర్చున్నారు సుధీర్, రాజులు! అంతలో అక్కడికి నాయకుడి కొడుకు ఓలూ వచ్చాడు.

"మా నాన్న ఎక్కడ?" అడిగాడు.

"మీ నాన్న, మా నాన్న కిరీటంకోసం వెళ్ళారు" సుధీర్ బదులు చెప్పాడు.

ఓలూ ఆ మాటలు విని పొట్ట చెక్కలయ్యేలా నవ్వాడు. "ఏమిటీ? వయసు మళ్ళిన వాళ్ళు యుద్ధానికి పోతే యువకులు మీరిక్కడ గోళ్ళుగిల్లుకుంటూ కూర్చున్నారా! పదండి మనమూ వెళ్ళి వారికి సహాయ పడదాం!"

సుధీర్, రాజూ, ఓలూ బయలుదేరారు. సునీత తాను ఒక్కర్తే వుండలేననీ, తనుగూడ వస్తాననీ పట్టుపట్టింది. ఆమెను ఒంటరిగా విడవటం ఇష్టంలేక ఆమెగూడ వెంట రాగా ముందుకు సాగారు.

10

"మనం అందరం ఒక మూకగా వెళ్ళేబదులు మూడు వేపులగా వెడదాం. రాబర్ట్ ఎక్కడైనా కనబడితే మిగతా వారికి సైగచేయాలి. అప్పుడు అందరం కలిసి వాడి భరతం పట్టాలి" అన్నాడు సుధీర్.

కానీ వాళ్ళ ప్లానుని అమలుపరచకముందే, రాబర్ట్ ఆ దాపులనే ఉన్నట్టుగా రైఫిల్ షాట్ వినవచ్చింది.

అందరూ ఉలికిపడ్డారు. ఆ షాట్ సుకుమార్నిగానీ మామానిగానీ ఉద్దేశింపబడిందేమో!

అంతలోనే రైఫిల్ షాట్కి ప్రతిగా రివాల్వర్ పేలింది. సుధీర్కి సంతోషం వేసింది.

మరి నాలుగడుగులు వేసి కొండ ఎక్కేసరికి, వారికి పరిస్థితి అర్థమైంది. దూరంగా ఒకవేపు కొండరాయి వెనుక విలియమ్ బ్రూక్స్, రాబర్ట్, మరో అనుచరుడు నక్కి వున్నారు.

ఎదురుగా ఫర్లాంగు దూరంలో మరో పెద్ద రాయి

చాటున సుకుమార్, మామో దాక్కునివున్నారు. ఇద్దరూ ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకుంటున్నారు. ఇరుపక్షాల వద్దా ఆయుధాలుండడంతో దాక్కున్నచోటు నుంచి ఎవరూ పైకి లేవలేని స్థితిలోవున్నారు.

నలుగురూ కళ్ళతో సైగ చేసుకున్నారు. గుప్పిళ్ళ నిండా రాళ్ళు ఏరుకున్నారు. తాము కూర్చున్న చోటు నుంచీ, అంటే మూడో దిశ నుంచి బ్రూక్స్ వర్గం పైకి రాళ్ళవర్షం కురిపించారు.

ఆ రాళ్ళు తగిలితే ఎవరూ చావరు. కానీ అవి తగిలిన వాళ్ళు గాయపడడం మాత్రం నిస్సందేహం!

కొండపై నుంచి రాళ్ళు దొర్లి పడుతూండడంతో బ్రూక్స్‌వర్గం గాభరాపడ్డారు. ఏదో కొత్త ప్రమాదం ముంచుకొస్తూన్నదని ప్రాణభయంతో అక్కడనుంచి పైకిలేచారు.

అదను గమనించిన సుకుమార్ రివాల్వర్ ప్రేల్చాడు. అతడి గురి తప్పలేదు. రాబర్ట్ చేతిలోని రైఫిల్ ఎగిరిపోయింది. అతడి చేతికి గాయమై రక్తం స్రవించ సాగింది.

ఎప్పుడైతే రైఫిల్ ఎగిరిపోయిందో మామో అతడి అనుయాయులు ఆ ముగ్గుర్నీ చుట్టుముట్టారు. సుకుమార్ తన రివాల్వర్ గురిపెట్టి నిల్చున్నాడు. రాజా క్రిందపడిన రైఫిల్‌ని తీసుకుని మరోప్రక్క నిలబడ్డాడు.

కకోరా దీవి నాయకుడు రాబర్ట్ భుజానికి వ్రేలాడు తున్న సంచీలోంచి ప్యాకెట్‌ని లాక్కున్నాడు. అట్ట పెట్టె తెరిచి వైఢూర్య కిరీటాన్ని పైకి ఎత్తి పట్టుకున్నాడు. ఓలూ ఆనందంతో ఆటవిక భాషలో పాట పాడుతూ నాట్యం చేశాడు.

"అయ్యో! మిలియన్ డాలర్లు పోయాయే!" రాబర్టు విలపించాడు పెద్దగా.

మాహామో కిరీటాన్ని ఆట్టపెట్టెలో పెట్టాడు. తిరిగి సంచిలో ఉంచేశాడు. శత్రువులు ముగ్గురినీ నాయకుడి అనుచరులు బంధించారు.

11

ఆటవికుల చేతులలో కాగడాల కాంతిలో వైఢూర్య కిరీటం మెరిసిపోతోంది.

ఆటవికులు ఆనందంతో పెద్దగా అరుస్తూ చిందులు త్రొక్కుతూ ముందుకు సాగుతున్నారు.

గుడిసెముందు "కహునా" కకోరాదీవి మాంత్రికురాలు జుట్టు విరబోసుకొని దెయ్యంలా నిలబడివుంది.

మరుక్షణంలో మాహామో కంఠం అంతటా మారుమ్రోగి పోయింది.

"నా ప్రియతమ ప్రజలారా! ఈ కహునా తనమంత్ర శక్తుల్ని ఎప్పుడో కోల్పోయింది. వయస్సు పైబడి, శక్తి తరిగిపోతున్న ఆమెకు అధికార వాంఛ ప్రబలింది. ఆమె అనుమతితోనే తస్కరులు మన దీవిలో అడుగుపెట్టారు. ఇద్దరు ఆటవికుల్ని బలిగొన్నారు. వైఢూర్య కిరీటాన్ని ఎత్తుకుపోయారు. దీని కంతటికీ, ఈ అనర్థానికంతటికీ కారణం ఈ కహునాయే!

"కనుక ఈ సంఘటనలతో ఈనాటినుంచి మంత్రగత్తెగా ఆమె కివ్వబడే గౌరవహోదాలను రద్దు చేస్తున్నాను. రేపట్నుంచి ఆమె కేవలం మీలో ఒకరు. ఇందుకు మీరేమంటారు?"

ఆటవికులంతా ఏక కంఠంతో నాయకుడ్ని బలపరచారు. వైఢూర్యకిరీటం తిరిగి దొరికిన సందర్భంగా మరునాడు వేడుక జరగాలని నిర్ణయించబడింది.

12

కణోరాదీవి అంతా కోలాహలంగా ఉంది వేడుకలతో. పాటలూ, నృత్యాలూ మహావైభవంగా వుంది.

ఎత్తైన వేదికపై కూర్చుని తిలకిస్తున్నారు మామో, ఓలూ, సుకుమార్, సుధీర్, సునీత, రాజు.

"మామో! నీవు కోపం తెచ్చుకోనంటే, ఒక చిన్న సలహా చెబుతాను" అన్నాడు సుకుమార్.

"మీకంటే నాకు ఆప్తులు యెవరు? అవశ్యం చెప్పండి!"

"ఈ వైఢూర్య కిరీటాన్ని దొంగిలించటానికి వ్యర్థ ప్రయత్నాలు జరిగాయన్న వార్త యివాళ కాకపోయినా రేపయినా బయటి ప్రపంచానికి తెలుస్తుంది. అప్పుడు యింకా అనేకమంది దుర్మార్గులు దీన్ని కాజేయటానికి రంగంలోకి దూకుతారు?"

"ఆఁ! ఈ సారి మంచి బందోబస్తు యేర్పాటు చేయనూ?"

"అంతకష్టం ఎందుకు? ఈ నాగరిక శకంలో గూడ మీ దీవి ప్రజలు అనాగరికులుగానే మిగిలిపోయారు. ఈ కిరీటం మీ వద్ద వున్నందువల్ల ఒరిగేది యేమీ లేదు. పైగా దాన్ని కాపాడవలసిన బాధ్యత కత్తిమీద సాము వంటిది."

"అందుకని ఏం చేయమంటారు నన్ను?"

"ఈ వైఢూర్య కిరీటాన్ని ప్రపంచవ్యాప్తిగా ప్రకటించి వేలం వెయ్యి. కనీసం మిలియన్ డాలర్ల ధర పలుకుతుంది. ఆ డబ్బుతో మీ దీవిలో మంచి మంచి బంగళాలు కట్టించు. మీ ప్రజలకు విజ్ఞానాన్ని పంచి పెట్టేందుకు విద్యాలయాల్ని ఏర్పాటు చేయి. జనరేటర్లతో విద్యుచ్ఛక్తిని తయారు చేసుకోవచ్చు. ప్రపంచ పటంలో మీ దీవిని సస్యశ్యామలం చేయి. మణిదీపంలా వెలిగేలా చేయి!"

మామో తల నిమురుతున్నాడు. పదేపదే తన ముందున్న కిరీటాన్నీ, సుకుమార్‌నీ మార్చి మార్చి చూడసాగాడు.

"మీరు చెప్పిన ఆలోచనా బాగానేవుంది! కానీ కాబోయే నాయకుడు నా కుమారుడు ఓలూ అభిప్రాయం గూడ తెలుసుకుంటే మంచిదేమో!" అంటూ కుమారుడి వంక చూశాడు మామో.

"వారు చెప్పిందే సమంజసంగా వుంది. ప్రజల సంక్షేమానికి ఉపయోగపడని ధనం నిరుపయోగం!" అంతవరకూ మౌనంగా వింటున్న ఓలూ అన్నాడు.

"ఇంకేం! ఆ వేలం ఏర్పాట్లేవో మీరే చూడండి!" మామో సంతోషంగా అన్నాడు.

"అంతేకాదు. మీరు అనుమతిస్తే ఓలూను మా వెంట తీసుకువెడతాం. మద్రాసులో చదువు పూర్తి చేస్తాడు."

ఓలూ ఎగిరి గంతేశాడు. కృతజ్ఞతా పూర్వకంగా, కూర్చున్న చోటునుంచి లేచివచ్చి, సుకుమార్‌కి అభివందనం చేశాడు.

"అదీగూడ బాగానే వుంది. పైగా వాడ్ని నాయకుడ్నిగా చేసేందుకు ఇంకా చాలా వ్యవధి వుంది. ఈలోగా బాగా చదువుకుంటాడు. నిజంగా మీలాంటి మంచివారి స్నేహం లభించటం మా అదృష్టం! కాదు, కాదు, మా దీవి ప్రజల అదృష్టం!"

నృత్యం చేస్తున్న ఆటవికుల గుంపు వేదికమీదకు వచ్చారు. ఒక్కొక్కరికీ చేయూతనిచ్చి క్రిందకు దింపారు. క్రిందకు దిగిన ప్రతిఒక్కరూ ఆటవికులతో పాటు ఆనందంతో నృత్యం చేయటంలో తమను తామే మైమరచిపోయారు.

—: ఐపోయింది: —